డాక్టర్ శశికళ పేషెంటుకు ఇంజక్షన్ ఇచ్చి, జాగ్రత్తగా చూస్తూండమని నర్స్‌కుచెప్పి, నర్సింగ్ హోం వరండాలోకి వచ్చింది.

అక్కడ బికారిలా నిలబడి వున్నాడు సారథి. అతని ముఖం దిగులుతో పీక్కుపోయింది. గడ్డం పెరిగింది. వారం పదిరోజుల నుండి ఉపవాసం చేసిన వాడిలా ఉన్నాడు. అసలు అతనే ఒక పేషెంటులా వున్నాడు.

డాక్టర్ని చూడగానే సారథి ఆత్రుతగా ఆమె దగ్గరికి వచ్చాడు.

"డాక్టర్, నా పాపకు ఏమీ ప్రాణాపాయం లేదుకదా? ప్లీజ్ చెప్పండి" అంటూ దాదాపు ఏడ్పినంత పనిచేశాడు.

"ఎంత ఖర్చయినా సరే, నా తల తాకట్టు పెట్టయినా డబ్బు తెస్తాను. వైద్యం చేయించండి డాక్టర్‌గారూ!" అక్కడే ఉన్న ముసలాయన చేతులు నులుపుకుంటూ ప్రార్థిస్తున్నాడు.

శశికళ మౌనంగా ముందుకు కదిలి పోర్టికోలో ఉన్న కారు ఎక్కింది.

ఆమె వెంటే వస్తున్న మరో నర్స్ "డాక్టరమ్మ వైద్యం చేయడానికి ఒప్పుకున్నారంటే, ఇక మీ బిడ్డకు బాగయినట్టేనయ్యా. మీరేం ఆదుర్దా పడకండి. ఆమె గురించి మీకేం తెలిసినట్లు లేదు" అంటూ వెళ్ళిపోయింది.

అక్కడే బెంచీపై కూర్చున్న మరో పేషెంటు తాలూకు బంధువులు, "ఏమిటండీ సుస్తీ? ఎవరికి?" అని ప్రశ్నించారు.

ముసలాయన చెప్పాడు. "వీడు నా కొడుకు బాబూ, వీడి కూతురు పదేళ్ళపిల్ల. వారం రోజుల కిందట స్టౌ దగ్గరికి వెళ్ళి ఒళ్ళు కాల్చుకుంది. మా ఊరి హాస్పిటల్లో చికిత్స చేయించాం. కానీ బాగయ్యే సూచనలు కనిపించలేదు. ఈ డాక్టరుగారు బాగా వైద్యం చేస్తారని విన్నాం. అంచేత ఇక్కడికి తీసుకొచ్చాం. పిల్ల మన తెలివిలో లేదు. ఆ భగవంతుడు మమ్మల్ని ఏం చేయాలనుకున్నాడో తెలీదు" అంటూ కళ్ళు తుడుచుకున్నాడు.



సగంలో ఆగిన ఆల్బమ్

బి. స్వర్ణాంబ

ఆ ఎదుటి వ్యక్తి. "డాక్టరమ్మగారి హస్త వాసి మంచిదండీ. అసలు, అనుమానంగా వుంటే ఆమే పెద్దాసుపత్రికి తీసికెళ్ళి పొమ్మంటారు. మీ పిల్ల లక్షణంగా మీ ఇంట్లో తిరుగుతుంది దిగులు పడకండి" అని ముసలాయన్ని ఓదార్చాడు.

సారథి లోపలికివెళ్ళి కూతుర్ని చూసి వచ్చాడు. "నాన్నా నువ్వు ఇంటికి వెళ్ళు. నేనిక్క-డుంటాను।" అని తండ్రిని పంపేశాడు.

*

డాక్టర్ శశికళ ఇంటికి వచ్చి తన రూములోకి వెళ్ళి మంచం మీద వాలిపోయింది. ఆమె మనస్సులో ఎన్నో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. సారథి తనను గుర్తుపట్టినట్టు లేదు. బహుశః అతని మనసంతా కూతురిపట్ల భయాందోళనలతో నిండి ఉంది కాబట్టి, మరే ఆలోచనా అతని మనసులోకి వచ్చి వుండదు. కన్నకూతురు చావుబ్రతుకుల్లో ఉందన్న సత్యం అతని మనసును కాల్చేస్తోంది. కానీ తను సారథిని గుర్తించింది; అతనూ, అతని తండ్రీ పసిబిడ్డకు ప్రాణాలు పోయమని దేవిరించినపుడు–తన తండ్రి ఒకప్పటి రూపం వాళ్లల్లో కనబడింది. అప్పుడు తన తండ్రి పడ్డ ఆవేదన ఎంతటిదో తనకర్థమైంది. అవును... అది నిజమే. ఎప్పుడైనా బాధననుభవించే వారి హృదయావేదన ఎదుటివారికి ఎందుకర్థమౌతుంది? అందుకే సారథికీ, వాళ్ళ తండ్రికీ తమ గోడు తెలియలేదు. కానీ తన విషయం ఇప్పుడలా కాదు. తను డాక్టర్‌గా ఎన్నో చావులు చూసింది. వాళ్ళ తాలూకు బంధువులు హృదయవిదారకంగా విలపిస్తోంటే వాళ్ళ ఆవేదనను తను అర్థం చేసుకోగలదు. ఎవరి జీవితంలోనైనా చావు ఒక్కసారే వస్తుంది. అంతకుమించిన ఆపద లేదంటారు. కానీ కొన్ని జీవితాల్లో చావులాంటి ఆపదలు అడుగడుగునా తారసిల్లుతూనే వుంటాయి. మృత్యువు కంటే భయంకరంగా అది వ్యక్తి మీద దెబ్బ కొడుతుంది. ఆ మనిషిని క్రుంగదీస్తుంది. చావుతో ఒక్కసారిగా మనిషి బాధలు మాయమౌతాయి; కనీసం ఆ మరణించిన వ్యక్తికి। కానీ కొన్ని కష్టాలు అలాకాదు. ఆమరణాంతమూ అవి పీడిస్తూనే ఉంటాయి. దానికి తన జీవితమే ఒక ఉదాహరణ....

శశికళ మెల్లిగా బీరువా తాళం తీసింది. అందులో లాకర్‌లో ఉన్న ఫోటో ఆల్బం తీసుకున్నది. ఆ ఆల్బంలో సగం పేజీలు ఫోటోలతో నిండిపోయాయి. మిగిలిన సగం ఖాళీగా వుంది తన మనసులాగే....తన జీవితం లాగే. మిగిలిన సగం ఆల్బం ఎప్పటికీ పూర్తవదు! దాన్ని పూర్తిచేసే ఫోటోలు ఇక ఎన్నటికీ తీయబడవు!

కుర్చీలో కూర్చుని ఆల్బం తెరిచింది ఆమె.

మొదటి పేజీలో పెళ్ళివారంతా పెద్ద గ్రూప్ ఫోటోలో ఉన్నారు. స్టేషన్‌లో వాళ్ళంతా రైలు దిగగానే తీసిన ఫోటో అది. అన్నయ్యకు ఫోటోలు తీయడం సరదా. అందుకనే అన్ని ఫోటోలు తీశాడు. పెళ్లికొడుకు అందరిమధ్యా కంపార్ట్‌మెంట్ దగ్గర నిలబడి వున్నాడు.

రెండో ఫోటో తమ ఇంట్లో తీసింది. ముత్తైదువల మధ్య తాను, పెళ్లికూతురి వేషంలో. స్నేహితురాండ్రంతా ఏవో ఛలోక్తులు విసురుతూ నవ్వుతున్నారు. తనకింకా జ్ఞాపకం. తన ఫ్రెండ్ సుజాత, పెళ్లికొడుక్కిమ్మని ఒక ప్యాకెట్ తన చేతిలో పెట్టింది. అందులో ఏముందో చూడగూడదనీ, తను అత్తవారింటికి వెళ్ళాక ఇద్దరూ కలిసి చూడాలనీ చెప్పింది. తన గుప్పిట్లో ఆ చిన్న పెట్టె వుంచి గుప్పిలి మూసింది. ,తన పిడికిలిని అదిమి పట్టుకున్న సుజాత చెయ్యి; ఇద్దరి ముఖాల్లో నవ్వులు. కానీ ఆ పెట్టెలో ఏముందో చూసే అవకాశం రాలేదు. రాదు కూడా। మూడో ఫోటో- పెళ్లికొడుకు కాశీ యాత్రలో ఉన్నాడు. తన తండ్రి, తమ్ముడు, అన్నయ్య అందరూ అతన్ని చుట్టుముట్టి నిలబడ్డారు.

తర్వాతి ఫోటోలు దాదాపు చాలావరకు పెళ్ళికొడుకు వైపువారివి. అతని అక్కయ్యా, తల్లీ, తన తల్లీ తండ్రితో ఏదో మాట్లాడుతున్నారు. ఒక ఫోటోలో.

ఇంకో ఫోటోలో తన తండ్రి, పెళ్ళికొడుకు తండ్రికి ఏదో చెబుతున్నాడు. ఎందుకో తన తండ్రి ముఖంలో ఆందోళన; .కూతురి పెళ్ళి జరుగుతోందన్న ఉత్సాహం లేదు....

తర్వాతి ఫోటోల్లో పెళ్ళిమంటపంలో పెళ్ళికొడుకు, పురోహితుడు ఏదో పూజ చేయిస్తున్నాడు. ఇంకో ఫోటోలో తను గౌరీపూజ చేస్తోంది. మరో ఫోటోలో తను పెళ్ళిపీటలపైన; ఇటూ, అటూ అమ్మా, నాన్న! కూతుర్ని కని, పెంచి, పెద్దచేసి మరొకరితో ఆమె జీవితాన్ని ముడిపెట్టబోతున్న తరుణం. తల్లిదండ్రుల భావాలెలా ఉంటాయో। తన తల్లి ముఖంలో సంతోషం, దిగులు ఏవేవో భావాల కలయిక. అంతే....ఆ తర్వాత ఫోటోలు లేవు.

ఆల్బం సగంలో ఆగిపోయింది. కారణం.... సంతోషకరమైన జ్ఞాపకాల కన్నా దిగులుతో కూడిన జ్ఞాపకాలే జీవితంలో వెంటాడుతాయి. వాటికి ఏ ఫోటోలూ తీయనవసరం లేదు. అవి శాశ్వతంగా మనస్సనే కెమెరాలో బంధింపబడి ఉంటాయి. ఆ బరువు జ్ఞాపకాలే తన తల్లి జీవితాన్ని అంతం చేశాయి.

ఆ జ్ఞాపకాల బారినుండి తప్పించుకోవాలనే తను మెడిసిన్‌లో చేరింది. డాక్టరయింది. తన తండ్రి ఈలోకం నుండి నిష్క్రమించాడు. ఇప్పుడు తను రోగులపాలిటి దేవత; ఎందరికో శారీరక బాధలు తొలగింపజేసే డాక్టర్. కానీ తన గుండెలోని గాయం మాత్రం ఎవరూ మాన్పలేరు. తనవల్ల తల్లీ, తండ్రీ మరణించారనీ, కుటుంబం అశాంతిపాలయిందనీ తలుచుకుంటే మనస్సు మండిపోతుంది. కానీ దానికి తానెంతవరకూ కారకురాలు?

వార్త

జెమ్‌షెడ్‌పూర్‌లోని ఆంధ్ర మహిళా సమితి, ఆంధ్ర మహిళా సమితి ఈస్ట్‌జోన్ కలిసి–ఇటీవల జెమ్‌షెడ్‌పూర్‌లో "తెలుగు వెలుగు" కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. దాదాపు రెండువేల మంది ఆ కార్యక్రమానికి హాజరై–ఎంతో ఆనందించారు. ఆంధ్ర మహిళా సమితి ఈస్ట్‌జోన్ అధ్యక్షురాలు శ్రీమతి నళినీ ప్రసాద్–గ్రామీణ గీతాలద్వారా, జానపదుల జీవన విధానాలను తెలియజేసే ఉద్దేశంతోనే ఆ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టుగా చెప్పారు. అందులో ఇరవై ఇద్దరు కళాకారులు–పశువులను తోలుకునేటప్పుడు పాడే పాటలు, సాతాని జియ్యరు పాటలు, నీళ్ళకు వెళ్ళే వడతుల పాటలూ, కోతలప్పుడు రైతులు పాడే పాటలు, పడవ పాటలూ, దంపుళ్ళ పాటలూ, బండిపాటలూ, ఎంకి పాటలూ పాడి, శ్రోతలను ముగ్ధులను చేశారు. కొన్ని పాటలకు సందర్భానుసారంగా 'పాడ్‌స్లే' చూపారు. కొన్నింటికి భావం వివరిస్తూ, వ్యాఖ్యానించారు. కొన్ని పాటలకు చిన్నపిల్లలు చేసిన అభినయాలు కూడా చూడ ముచ్చటగా వున్నాయి.

సోవియట్ యూనియన్‌లోని ఆ ఆర్తెక్‌లో ఆ మధ్య అంతర్జాతీయ బాలల వేసవి విడిది కార్యక్రమం నెల రోజులపాటు జరిగింది. అందులో ఆంధ్రదేశంనుంచి గోపిశెట్టి సుజాత అనే అమ్మాయి కూడా పాల్గొన్నది. ఈ అమ్మాయి వయసు 13 సంవత్సరాలు. గుంటూరులోని బాల కుటీర్‌లో 10వ తరగతి చదువుతున్నది. సుజాత - నాట్యం బాగా చేస్తుంది. జిల్లా స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయి లోనూ జరిగిన జానపద నృత్యాల పోటీలలో చాలాసార్లు పాల్గొని, బహుమతులు గెల్చుకున్నది. జలంధర్‌లో ఆ మధ్య జరిగిన అఖిల భారత మహిళా సమాఖ్య మహా సభలలోనూ, కటక్‌లో జరిగిన ఇండో-జి డి ఆర్ మిత్ర మండలి మహాసభలలోనూ ఆమె నాట్య ప్రదర్శలు ఇచ్చి, అభినందనలూ, ప్రశంసలూ పొందింది.

ఆ ఆర్తెక్ కాంప్‌లో కూడా సుజాత, నాట్య ప్రదర్శనలు ఇచ్చి - స్వర్ణపతకం గెల్చుకున్నది. అలాగే మాస్కోలోని భారత దౌత్య కార్యాలయంలో కూడా నాట్య ప్రదర్శనలు ఇచ్చింది.

ఫోన్ మోగింది....శశికళ జ్ఞాపకాల వర్షం ఆగిపోయింది. రిసీవర్ అందుకుంది. నర్స్ చెబుతోంది....ఆ పాపకు-సారథి కూతురికి-తెలివొచ్చిందట! కానీ పిచ్చిచూపులు చూస్తోందనీ, త్వరగా రమ్మని....

శశికళ వెంటనే పోర్టికోలోకి వచ్చి కారెక్కింది. "అమ్మగారూ! భోంచేయరూ?" వంటమనిషి ప్రశ్నిస్తోంది.

కారు స్టార్ట్‌చేసింది శశికళ.

*

"అమ్మా! శశికళా, నిన్ను చూడగానే గుర్తుపట్టలేకపోయాను. ఆ తర్వాత జ్ఞాపకం వచ్చింది. ఆనాడు నీకు చేసిన అన్యాయానికి, నీవు ఈరోజు చేసిన ఉపకారంతో, మా తల తీసేసినట్లయింది. నీవు కసి తీర్చుకోవాలనుకుంటే క్షణం కూడా పట్టివుండేది కాదు. నీకు అన్ని విధాలా అన్యాయం కలిగింది. అయినా నీదెంత పెద్దమనసు? మమ్మల్ని క్షమించు తల్లీ!" ముసలాయన - సారథి తండ్రి - బ్రతిమాలుతున్నాడు. శశికళ మౌనంగా పేషెంటు దగ్గరి నుంచి కదలి, మరో పేషెంటు దగ్గరికి వెళ్ళిపోయింది.

సారథి వంచిన తల ఎత్తలేదు. పాప దగ్గరే కూర్చున్నాడు. పాపకు నిద్రపట్టింది. సారథి ఆలోచనలు కదిలాయి. ఆరోజు పెళ్ళిపీటలపై నుండి తనెంత మూర్ఖంగా లేచి వచ్చేశాడు? తన తండ్రి పట్టుదల అది. కట్నం డబ్బులో నాలుగు వేలు తగ్గాయిట! ఎలాగో తర్వాత సర్దుతానని శశికళ తండ్రి బ్రతిమాలాడు. ఎంతగానో అభ్యర్థించాడు. వేర్వేరుగా తనను, తండ్రిని, తల్లినీ, దేవిరించాడు. పెళ్ళికూతురికి అన్యాయం చేయొద్దన్నాడు. "దానికింక పెళ్ళి కాదండీ, నా పరువు నట్టేట్లో కలిసిపోతుంద"ని వాపోయాడు. కానీ వాళ్ళ అభ్యర్ధనలేవీ తమ తలకెక్కలేదు. చివరికి శశికళ పీటలమీద నుండి లేచి లోపలికి వెళ్ళిపోయింది. అంతా ఆశ్చర్య పోయారు. ఏదైనా అఘాయిత్యం చేస్తుందేమోనని భయపడ్డారు.

కానీ అలాంటిదేం జరగలేదు. శశికళ అన్నయ్య వచ్చి పెద్ద దుమారం లేవదీశాడు. ఇట్లాంటి డబ్బు మనుషులకు తన చెల్లెల్ని ఇవ్వననీ, ఒకవేళ వాళ్ళను బతిమాలి ఈ పెళ్ళి జరిపిస్తే తను ఈ ఇంటికి రాననీ చెప్పి వెళ్ళిపోయాడు. ఎలాగైతేనేం పెళ్ళి ఆగిపోయింది. ఆ తర్వాత తనకు శారదతో పెళ్లి జరిగిపోయింది. శశికళకు చాలరోజుల వరకు పెళ్లి కాలేదని విన్నాడు. తర్వాత వాళ్ళ సంగతులేవీ తనకు తెలీలేదు. ఈ సమాజంలో, పీటల మీది పెళ్లి చెడగొట్టి లేచి వెళ్లిన మగవాడికి వెంటనే పెళ్ళి జరిగిపోతుంది. ఆ దౌర్భాగ్యుడికి పిల్లనిచ్చే కన్యాదాతలెందరో వుంటారు. కానీ ఆడదానికి మాత్రం అదొక మచ్చగా మిగిలిపోతుంది!!

*

శశికళ ఒక్కొక్క పేషెంటునే చూస్తూ ఆప్యాయంగా పలకరిస్తూ, నర్సింగ్ హోం అంతా తిరుగుతోంది. సారథి పాపను తీసుకుని వెళ్ళి టాక్సీలో కూర్చోపెట్టాడు. శశికళ దగ్గరికి వచ్చి "డాక్టర్! మీకు ఎలా థ్యాంక్స్ చెప్పుకోవాలో తెలీలేదు. మా పాపను బ్రతికించి ఇచ్చారు." అంటూ నమస్కారం చేశాడు.

శశికళ నవ్వింది. "మీరు ప్రత్యేకించి నాకు కృతజ్ఞతలు చెప్పనక్కర్లేదు. ఆ నాడు పెళ్లి పీటల మీదే నా బ్రతుకు మలుపు తిరిగింది. మీరు తిరస్కరించిన కట్నం, నాకీ చదువు చెప్పించి నన్ను డాక్టర్‌గా నిలబెట్టింది. ఈ నాడింతమందికి నేను నా చేతనైన సేవ చేయడానికి కారణమైంది. ఆ మలుపే లేకుంటే నేనూ మీ రెండో భార్య శారదలాగే ఆత్మహత్య చేసుకొని మరో లోకంలో ఉండేదాన్ని. ఇంతమందికి జీవితం ప్రసాదించవలసి ఉండబట్టే దేవుడు నన్నా చావు నుండి కాపాడాడు. అందుకు మీకే నా థ్యాంక్స్. వెళ్ళి రండి....సారీ ఇది హాస్పిటల్ కదూ? వెళ్ళండి-" అంటూ వెనక్కి తిరిగి వెళ్లిపోయింది శశికళ.

తను పెట్టిన బాధలు పడలేక శారద ఆత్మహత్య చేసుకున్న సంగతి శశికళకు తెలుసా? ఎలా తెలుసు? అని ఆశ్చర్యపోతూ ముందుకు రెండడుగులు వేశాడు సారథి. "మిష్టర్ సారథీ, ఒకమాట!" శశికళ కంఠం విని వెనక్కి తిరిగాడతను.

"మీ పాప తల్లి-అంటే శారద-నా స్నేహితురాలు. దాని కూతురిని జాగ్రత్తగా చూచుకోండి ఇకనైనా. ఆమెను మీరు పెంచలేనినాడు నా దగ్గరికి పంపేయండి, అంతేకానీ మరో మరణానికి కారకులు కాకండి-" శశికళ గంభీరంగా అని లోపలికి వెళ్ళిపోయింది.

చెట్టంత మగవాడు, కట్నం ఇవ్వలేదని పీటల మీద పెళ్ళి చెడగొట్టి కన్నె హృదయాన్ని గాయపరచిన మగవాడు, భార్యను ప్రేమగా చూచుకోలేని మగవాడు—సారథి - పాపం - బరువుగా అడుగులేస్తూ వెళ్ళి టాక్సీ ఎక్కాడు. □

399